# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





# ధరణి జోలికొస్తే కాంగ్రెస్‌కు పాతరే..

## ఆ పార్టీ నాయకుల వ్యాఖ్యలపై మండిపడుతున్న రైతాంగం

## పటేల్, పట్వారీ వ్యవస్థ వద్దంటున్న అన్నదాత

ముఖ్యమంత్రి కేసీఆర్ పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్ రైతుల భూములకు రక్షణ కల్పిస్తున్నది. దీంతో అన్నదాతలు నిశ్చింతగా ఉన్నారు. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేసి, పాత విధానాన్ని తీసుకొస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధరణి పోతే మా భూములకు రక్షణ ఉండదని, వివరాలు తారుమారవుతాయని ఆందోళన చెందుతున్నారు. కౌలుదారు కాలమ్ గొడవలకు దారి తీస్తుందని మండిపడుతున్నారు. అవినీతికి ఆస్కారముండే పటేల్, పట్వారీ వ్యవస్థ మాకొద్దని తెగేసి చెప్తున్నారు. ధరణి పోర్టల్ జోలికొస్తే కాంగ్రెస్‌కు పాతరేస్తామని హెచ్చరిస్తున్నారు.

### కాంగ్రెస్ వస్తే మళ్లీ దళారుల రాజ్యమే



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మళ్లీ దళారుల రాజ్యం వస్తుంది. గతంలో ఎక్కడ చూసినా భూ సమస్యలు ఉండేవి. పేరు మార్చాలన్నా, పట్టా కావాలన్నా దళారుల వద్దకు వెళ్లాల్సిందే. వాళ్లు చెప్పినంత ఇచ్చి పని చేయించుకునే పరిస్థితి ఉండేది. తెలంగాణలో సీఎం కేసీఆర్ సార్ ధరణి పోర్టల్ తెచ్చాక ఆ పరిస్థితి మారింది. భూ రిజిస్ట్రేషన్లు సులువుగా అవుతున్నాయి. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే ధరణి రద్దుచేస్తామని, భూమాత పోర్టల్ తెస్తామంటున్న మాటలతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. కాంగ్రెస్ పాలన వస్తే మళ్లీ దళారుల రాజ్యం వస్తుందని గుబులు పడుతున్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటుతోపాటు ధరణితో వ్యవసాయం పండుగలా సాగాలన్నా సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలుపాలె.

**–బండి రాజుగౌడ్, రైతు, తూర్పుగూడెం, ఆలేరు రూరల్**

### ధరణితో రద్దుతో మళ్లీ ఎనుకటి రోజులే..



సమైక్య పాలనలోని రెవెన్యూ పద్ధతితో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. అప్పుడు భూ రికార్డులన్నీ తప్పుల తడకగా ఉండేవి. వాటిని సరి చేసేందుకు ఆఫీసుల చుట్టూ తిరిగినా పని కాకపోయేది. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో రైతుల భూములకు రక్షణ ఏర్పడింది. గ్రామాల్లో ఎలాంటి గొడవలు లేవు. అంతా ఆన్‌లైన్ కావడంతో పని సులువుగా అవుతుంది. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తామని మాట్లాడుతున్నాడు. ధరణి తీసేస్తే మళ్లీ ఎనుకటి రోజులే వస్తాయి. వందకు వంద శాతం ధరణితోనే రైతులకు మేలు జరుగుతుంది. ధరణి ఉండాలంటే రైతులమంతా కేసీఆర్‌వైపే ఉండాలి.

**–ఇంద్రాల భగవంత్, పోతిరెడ్డిపల్లి, ఆత్మకూరు(ఎం)**

### ధరణి తీసేస్తే గోస పడాల్సిందే..



తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ధరణి తీసేస్తే రైతులు కష్టాలు పాలవుతారు. ధరణి వచ్చినంక దళారుల వ్యవస్థ లేకుండా సమస్యలు తీరిపోతున్నాయి. గతంలో ఆఫీసులో చుట్టూ తిరిగేది. అప్పట్లో దళారుల హవా నడిచింది. పహాణి కావాలన్నా పట్వారీ, వీఆర్‌ఓ చుట్టూ తిరగాల్సి వచ్చేది. లంచం ఇస్తేనే పని అయ్యేది. ధరణితో భూమి రిజిస్ట్రేషన్లు త్వరగా జరిగి వెంటనే పాస్ బుక్‌లు వస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి తీసేసి భూమాత పోర్టల్‌ను తీసుకొస్తామంటున్నరు. అదే జరిగితే మళ్లీ రైతులు గోస పడాల్సిందే. రేవంత్ వద్దు.. భూమాత వద్దు. సీఎం కేసీఆర్ పాలన, ధరణి పోర్టల్‌తోనే రైతులంతా క్షేమంగా ఉన్నారు.

**–వడ్డమున్ని వెంకటేశం, భీమనపల్లి, భూదాన్‌పోచంపల్లి**

### లోపాయికారి ఒప్పందాలు పెరుగుతయ్



కాంగ్రెస్ హయాంలో రైతుల భూములు, రికార్డులకు ఏ మాత్రం భద్రత లేకుండే. ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు అధికారుల సహకారంతో దొంగ రిజిస్ట్రేషన్లు చేయించుకునేవారు. సామన్య రైతులు రికార్డుల గురించి తెలుసుకునే ఆస్కారం ఉండేది కాదు. భూ రికార్డుల్లో తేడాలు సరి చేసుకోవాలంటే అధికారుల చుట్టూ తిరిగి డబ్బులిచ్చి పని చేయించుకోవాల్సి వచ్చేది. సీఎం కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో రైతుల కష్టాలు తీరినయ్. ఎక్కడి నుంచైనా భూ వివరాలు తెలుసుకునే అవకాశం కలిగింది. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి తొలగించి అనుభదారు, కౌలుదారు కాలమ్స్ పెడితామంటుండడంతో మళ్లీ పాతరోజులే వస్తాయి. లోపాయికారి ఒప్పందాలు పెరుగుతాయి. అవి రాకుండా ఉండాలంటే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి.

**–ధీరావత్ బాలూనాయక్, వాలుతండా, బొమ్మలరామారం**

### పట్వారీ వ్యవస్థతో రైతులకు గోసే..



15 ఏండ్ల క్రితం కాంగ్రెసోళ్ల పాలనలో నా పేరున భూమి మార్చుకునేందుకు పట్వారీ చుట్టూ తిరిగినా పని కాలేదు. చివరకు రూ.600 ఇస్తే పని అయ్యింది. తెలంగాణలో సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత అలాంటి పరిస్థితి లేదు.. తాసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌కు వెళ్తే 15 నిమిషాల్లో పని జరుగుతుంది. వారం తిరుగక ముందే పోస్టులో పాస్‌బుక్ వస్తుంది.. అలాంటిది కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తాం అంటున్నారు. ధరణి తీసేస్తే రైతులకు మళ్లీ గోస తప్పదు. రైతులను ఇబ్బంది పెట్టే కాంగ్రెస్‌కి రైతుల ఓట్లు అడిగేందుకు సిగ్గుండాలి. ధరణి తీసుకొచ్చిన సీఎం కేసీఆర్‌కే రైతుల మద్దతు ఉంటుంది.

**–చామకూర రవీందర్‌రెడ్డి, రైతు, ఇక్కుర్తి గ్రామం, మోటకొండూర్**

విద్యుత్ కోతలు.. నాలుగైదు గంటల కరెంటు సరఫరా.. రాత్రివేళల్లో పొలాల వద్ద పడిగాపులు.. మోటరు వేసేందుకు వెళ్తే పాము, తేలుకాటుకు మృత్యువాత.. కరెంట్ కోసం ఆందోళనలు, కాల్పులు, మరణాలు.. ఇవీ కాంగ్రెస్ పాలనలో దుస్థితి. వీటన్నింటినీ రూపుమాపి సీఎం కేసీఆర్ స్వరాష్ట్రంలో వెలుగులు నింపారు. ఇది ఓర్వలేని కాంగ్రెస్ పార్టీ రైతులపై కక్ష పెంచుకున్నది. వ్యవసాయానికి 3 గంటల కరెంట్ చాలంటూ అన్నదాతకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నది. నిరంతర కరెంట్ అసవరం లేదని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నది. ఇన్ని డ్రామాలు ఆడుతున్న హస్తం పార్టీ.. అధికారంలోకి వస్తే తమ పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కారు చీకట్లేనని, మళ్లీ పాత రోజులు పునరావృతం అవుతాయని భగ్గుమంటున్నారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్‌ను ఆదిలోనే బొంద పెడుతామని, ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని చెప్తునారు.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ)



# కాంగ్రెస్‌ను నమ్మితే కటిక చీకట్లే..

## రైతు బతుకును అంధకారం చేసే కుట్రను తిప్పికొడతాం

### కాంగ్రెస్ వస్తే మళ్లీ బొంబాయి బతుకులే

కాంగ్రెసోళ్లు వస్తే 3 గంటల కరెంటే ఇస్తమంటున్నరు. ఈ కరెంటుతో ఎకరం పొలం కూడా పారదు. వాళ్ల మాటలు వింటుంటే పాత రోజులు గుర్తుకొస్తున్నాయి. కాంగ్రెస్ హయాంలో కరెంట్ ఎప్పుడు వచ్చేదో, ఎప్పుడు పోయేదో తెలియకపోయేది. రాత్రిపూట వచ్చే కరెంటు కోసం బావుల దగ్గర పడుకోవాల్సి వచ్చేది. ఈ క్రమంలో పాములు, తెళ్ల బారిన పడి మృత్యువాత పడిన రైతులు ఎంతో మంది ఉన్నారు. అలాంటి పరిస్థితి మళ్లీ వస్తే వ్యవసాయం వదిలి బతుకుదెరువు కోసం బొంబాయి బాట పట్టాల్సిందే. ప్రస్తుతం సీఎం కేసీఆర్ ఇస్తున్న 24 గంటల కరెంటుతో రైతులంతా సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వకుండా మళ్లీ కేసీఆర్‌ను గెలిపించుకుంటేనే రైతులు బాగుపడతరు.

**–బర్మ కనకయ్య, రైతు, జాల, రాజాపేట**

### 10హెచ్‌పీ మోటర్లతో అప్పుల పాలే..



కాంగ్రెస్ హయాంలో వచ్చీరాని కరెంటుతో పొలాలు పారక చివరికి ఎండిపోయేవి. కరెంట్ కోసం రాత్రంతా బావుల దగ్గర కాపలాకాసేవాళ్లం. ఈక్రమంలో రైతులు కరెంట్ షాక్‌తో, పాములు, తేళ్ల కాటుకు గురై ఎంతోమంది చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. నేడు స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఎవుసానికి 24 గంటల కరెంట్ సరఫరా అవుతుంది. ఈ కరెంటుతో రైతులంతా సంతోషంగా వ్యవసాయం చేస్తున్నారు. రైతుల అభివృద్ధి చూసి ఓర్వలేని కాంగ్రెస్ నాయకులు 3 గంటల కరెంట్ చాలని చెబుతున్నారు. 10హెచ్‌పీ మోటర్లు వాడాలని సూచిస్తున్నారు. 3 గంటల కరెంట్‌తో ఒక్క మడి కూడా తడవదు. పెద్ద మోటర్లతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే ప్రమాదం ఉంది. అది కొనాలంటే ఖర్చుతో కూడుకున్నది. అందుకోసం అప్పులు చేయాల్సి వస్తది. ఇబ్బందులు పడేకన్నా 24 కరెంటు ఇస్తున్న సీఎం కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తెచ్చుకోవడం ఉత్తమం.

**–యాంజాల సీతారాములు, రంగాపురం, బొమ్మలరామారం**



### 3 గంటల కరెంటుతో వ్యవసాయం సాగదు



స్వరాష్ట్రంలో రైతుల కష్టాలు తీర్చింది సీఎం కేసీఆరే. సాగుకు 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తుండడంతో రైతులంతా వ్యవసాయానిన పండుగలా చేస్తూ సంతోషంగా ఉన్నారు. గతంలో బీళ్లుగా ఉన్న భూములన్నీ పచ్చబడ్డాయి. ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెసోళ్లు ఇష్టానుసారంగా మాట్లాడుతూ.. వ్యవసాయానికి 3 గంటల కరెంటు సరిపోతదని, రైతులంతా 10హెచ్‌పీ మోటర్లు వాడాలని ఉచిత సలహాలు ఇస్తున్నారు. కానీ, 3 గంటల కరెంటుతో ఎకరం పొలం కూడా పారదు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటే రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. ఈ ఖర్చంతా ఎవరు భరించాలి? కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మోసపోకుండా 24 గంటల కరెంటు ఇస్తున్న సీఎం కేసీఆర్‌కు అండగా నిలుస్తాం.

**–తుమ్మల మహేందర్‌రెడ్డి, రైతు, తిమ్మాపురం, ఆత్మకూరు(ఎం)**

### 10హెచ్‌పీ మోటర్లతో అప్పుల పాలు కావాల్సిందే



ఇప్పుడిప్పుడే బాగుపడుతున్న రైతులను చూసి ఓర్వలేని కాంగ్రెస్ మళ్లీ మోసం చేయాలని చూస్తున్నది. 3 గంటల కరెంటు చాలని, రైతులు 10 హెచ్‌పీ మోటర్లు వాడాలని ఉచిత సలహాలు ఇస్తూ రైతులను అప్పుల పాలు చేయాలని చూస్తున్నది. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల ఉచిత కరెంటుతోపాటు రైతుబంధు, రైతుబీమాను చూసి ఓర్వలేని కాంగ్రెస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. మోసకారి కాంగ్రెస్‌ను వచ్చే ఎన్నికల్లో మట్టుపెడతం. రైతుల బాగోగులు మంచిగా చూసుకుంటున్న బీఆర్‌ఎస్‌కు మద్దతిస్తాం.

**–కొలను కాంతారెడ్డి, గూడూరు, బీబీనగర్**

### ట్రాన్స్‌ఫార్మర్లు పేలుడు ఖాయం



మాది భీమనపల్లి గ్రామం. మాకు ఊర్లో 10 ఎకరాల భూమి ఉంది. అందులో వరి సాగు చేస్తున్నా. తెలంగాణ వచ్చినంక ఫుల్ కరెంటు వస్తుంది. 24 గంటల కరెంటుతో మా ఇష్టం ఉన్నప్పుడు పొలానికి నీళ్లు పెడుతున్నం. పొలాలు మంచిగా పారి పంట బాగా పండుతుండడంతో సంతోషంగా ఉన్నాం. అది చూసి ఓర్వలేని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుద్ధిలేని మాటలు మాట్లాడుతుండు. 3 గంటల కరెంటు చాలని, 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని ఇష్టమొచ్చినట్లు వాగుతుండు. 3 గంటల కరెంటుతో మూడు గంటల భూమి కూడా పారదు. మా ఏరియాలో ఎవ్వరు 10 హెచ్పి మోటర్లు వాడరు. వ్యవసాయం గురించి తెల్వనోళ్లు గట్లనే మాట్లాడుతారు. రైతులకు అన్నివిధాలుగా మేలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాల్సిన సమయం ఆసన్నమైంది.

**–కందాల బాల్‌రెడ్డి, రైతు, భీమనపల్లి, భూదాన్‌పోచంపల్లి**



### 3 గంటల కరెంట్ ఏ మూలకు చాలదు

రైతులకు 24 గంటల కరెంట్ వద్దు.. 3 గంటల కరెంట్ చాలు అన్న రేవంత్‌రెడ్డికి రైతుల కష్టాలు ఏం తెలుసు. ఎకరం పొలం పారాలంటే పొద్దస్తమానం నీళ్లు కట్టాలి. సీఎం కేసీఆర్ రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తుండడంతో రైతులు పుష్కలంగా పంటలు పండిస్తున్నారు. అలాంటిది 3 గంటల కరెంట్ ఇస్తే మూలకు కూడా సరిపోతది. ఈ కరెంటుతో పొలాలు ఎండిపోయి రైతులు ఆగమవడం ఖాయం. 3 గంటల కరెంట్ సరిపోతదంటున్న కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేసి సీఎం కేసీఆర్‌ను మళ్లీ గెలిపించుకోవాలి.

**–చాడ నాగరాజు, రైతు, కొలనుపాక, ఆలేరు రూరల్**



### 3 గంటల కరెంటుతో చీకటి బతుకులే..

నాకు మూడెకరాల భూమి ఉంది. దాన్ని సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. కాంగ్రెస్ హయాంలో 9 గంటల కరెంట్ అని నమ్మబలికి 7 గంటలు కూడా ఇవ్వలేదు. ఇచ్చిన కరెంటు కూడా రాత్రి సగం, పగలు సగం ఇచ్చేది. అది కూడా లోఓల్టేజీతో వచ్చేది. దాంతో మోటర్లు కాలిపోయేవి. కాంగ్రెస్ హయంలో రైతులు దినదిన గండంగా జీవనం సాగించేవారు. నాటి 3 గంటల కరెంట్ వలన రైతులు రాత్రిపూట బావి దగ్గరకు వెళ్లి ఇబ్బంది పడ్డేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుతం 24 గంటల కరెంటు ఎంతో బాగుంది. రైతులు సంతోషంగా గుండె మీద చేయి వేసుకుని నిద్రపోతున్నారు. అది చూసి కాంగ్రెసోళ్లు ఓరుస్తలేరు. నాడు రైతులను పిప్పి చేసి ఇబ్బందులకు గురి చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ చీకటి రోజులే. 24గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తున్న సీఎం కేసీఆర్‌కే రైతులమంతా రుణపడి ఉంటాం.

**–దొంతిరి శ్రీరామ్‌రెడ్డి, రైతు, ఇక్కుర్తి, మోటకొండూర్**

### రైతుల ఉసురు తీసిన కాంగ్రెస్‌ను నమ్మం



కాంగ్రెస్ పార్టీ కల్లబొల్లి మాటలను రైతులెవరూ నమ్మరు. సమైక్య పాలనలో తెలంగాణ ప్రాంత తెలంగాణ రైతులు అష్టకష్టాలు పడ్డారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో రైతులకు భరోసా కల్పించిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్. కరెంటు కష్టాలను పూర్తిస్థాయిలో నివారించి రైతులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం. ఇంత మంచి ప్రభుత్వాన్ని వదులుకొని కాంగ్రెస్ దుర్మార్గ పాలనను ఎవరూ కోరుకోరు. 24 గంటల విద్యుత్ అందిస్తూ రైతుల పక్షపాతిగా ముఖ్యమంత్రి కేసీఆర్ మారారు. ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే రైతులు నమ్మే పరిస్థితిలో లేరు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కర్ణాటకలో రైతుల బాధలు అగమ్యగోచరంగా ఉన్నాయి. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన రైతులకు శ్రీరామరక్ష.

**–కంచి మల్లయ్య, రైతు, వీరవెల్లి, భువనగిరి కలెక్టరేట్**